# బొమ్మ-బొరుసు

పవని నిర్మల ప్రభావతి

అతగాడి కాళ్ళు అలవాటు లేని మార్గంలో నడుస్తున్నాయి. అందుకేనేమో తడబడుతున్నాయి. రాత్రి తొమ్మిదిన్నర కావొస్తోంది. "సెకెండు షో" పిక్చర్లకు వెడుతున్న జనం, రిక్షాలూ, ఫస్టు షో నుంచి వస్తున్న జనం రిక్షాలూ....కార్లూ....

ఆ చీకటి "కార్నర్స్" లో అక్క-డక్కడా అమ్మాయిలు....కాదు అమ్మాయిలలా మేకప్ చేసుకున్న "అమ్మ"లు. గాజు "బొమ్మ"లు! దిష్టి "బొమ్మ"లు! ఆహ్వానాలూ. అంగీకారాలూ. తిరస్కారాలూ, ఏమిటో కొత్తగానూ. కుతూహలంగానూ వుందతగాడికి. ఇంతక్రితం ఎప్పుడూ ఇంత పరిశీలనగా ఇలాటివి గమనించలేదు....ఎవరేనా గుర్తు పడతారేమోనని భయం.. వెనకాల కారుహారన్... త్రుళ్ళిపడి పక్కకు తప్పుకున్నాడు.

"గుమాస్తా జగన్మోహనరావు. కోటీశ్వరుడేం కాదు. లక్షాధికారి కూడా కాదు. ఏ పంచాయతి ప్రెసిడెంటూ. సమితిరాజూ. మునిసిపల్ ఛైర్మన్ మంత్రి....వగైరాలేమీ కాదు....కాబోడు కనీసం పేరులో వున్న "జగన్మో త్వమూ" లేదు కాకున్నా అమ్మా. లకు ఎంతటి "ఓవర్ కాన్ఫిడెన్స్" పోతే ఈ పేరు పెడతారు! ఏమీ క నన్ను ...ఆఫ్టరాల్ ఓ గుమాస్తాని ఎవరో గుర్తు పట్టేస్తారనీ ...సినిమా, లకులా ఆటోగ్రాఫుల కోసం ఎగబడతారన్నట్లు. నేనేదో నక్కి-నక్కి పోవటం వింతగా లేదూ?" అనుకున్నాడు జగన్మోహనరావు

"ఆ! అంతగా అయితే ఆఫీసు ప్యూనో! తోటి గుమాస్తాల్లో ఎవరేనానో గుర్తుపడితే పట్టనీ! ఏం? వాళ్ళంతా సిగరెట్లు కాల్చటం లేదూ? పేకాడటం లేదూ? చాటుమాటు "వ్యవహారాలు" లేవూ? అలాగే ఈ రోజు నేనూ సరదా పడుతున్నాను! సరదా! సరదా పడుతున్నా నేను? నైతిక పతనానికి నాందిని సరదా? తీసుకోగలనా?" అతగాడి మనసు ఎదురు ప్రశ్న వేయటంతో అతగాడి ఆలోచనలు అతగాడి జీవితంలోకి పరుగులు తీశాయి. మరేం చెయ్యాలి? ఈ విశాల నగరంలో మూడు రూము లనబడే ఇంటికి అరవై

రూపాయలు జీడుగ. అమ్మ, నాన్న చెల్లాయి....తమ్ముడు... తనూ, తనభార్య లలిత... గూడులో గుట్టబడిన జనం! సర సాలకూ, సరదాలకూ నోచుకోని బ్రతుకు!

అసలు తనలాటి వాడు పెళ్ళాడ కూడదు! ఇప్పుడు కోరుకుంటున్న "సరదా"లతో సరిపుచ్చుకో వలసింది. నాలుగువేలు కట్నం. అందమైన భార్యా అనగానే, అమ్మా, నాన్నలతో బాటుతనూ ఏదో బావుకుందామనుకున్నాడు!

పగలంతా రద్దీ . ఆఫీసు తొందరా. తున్నాడు....పదిహేనేళ్ళ నిండిపోయాయి. అటు బాలుడు. ఇటు యువకుడుకానీ సంధి వయసు.. .వాడికి ఏదో కుతూహలం. లలితతో తనేం మాట్లాడతోనని ...చెవు లింత చేసుకుంటాడు . నిద్రపోడు ఓ పటాన! పోయాడో లేదోనని అనుమానం వేధిస్తూనే వుంటుంది. కసురుకునేవయసు కాదు అధనా కసురుకున్నా అమ్మా,నాన్న లకు వినిపిస్తుంది....వాళ్ళేమనుకుంటారో నని భయం....పగలంతా చాకిరితో, ఆశ లతో, కలలతో అలసి పోయిన లలిత ...

---

ఆడది సరదా వస్తువు మాత్రమే కాదు. మగవాణ్ణి చెడ గొట్టనూ వచ్చు.. బాగు పరచనూ వచ్చు!

దారి తప్పే అర్భకుడికి సరైన మార్గం చూపే వ్యభిచార పతివ్రతలూ వున్నారు మన దేశంలో!!

---

స్కూళ్ళ తొందరా, వంటా. సిగ్గుపూర్తి గా వదలని లలిత....ఇంత మందిలో పలకరించటానికి సిగ్గుపడే తనూ.... పరాయి వాళ్ళుగానే వుండి పోతారు పగ లంతా!

ఇకరాత్రి....వాకిటి గదిలో అమ్మ, నాన్న, చెల్లాయి. మధ్య గదిలో తను, లలిత, తమ్ముడు....మూడో గది వంట గది... రాత్రి పదిదాటాక కదిగితే....అది ఆరేదెప్పుడు!

తమ్ముడు పిస్తు ఫారం చదువు కాస్సేపు ఏదో ఆనందం ఆశించి ...ఆశ చచ్చి....కాస్సేపట్లో నిద్రపోతుంది! నిద్ర పట్టని తను,


మధ్య రాత్రిలో బాత్‌రూంలోకి వెళ్ళా లంటే, మధ్యగది (తమగది)లోనుంచే, వంట ఇంట్లో నుంచి వెళ్ళాలి...అమ్మ ఒకసారి, నాన్న ఒకసారి....చెల్లాయి ఒకసారి ...తలుపు తట్టి....తలుపుతీస్తే కోపంతో బిగుసుకుపోయిన తమ మధ్య నుంచి వెళ్ళటం, రావటం....చూస్తుండ గానే తెల్లారిపోవటం....చర్విత చర్వణం,



ఇదా జీవితం....ఇదే నా జీవితం!

ఇలాటి వెధవ జీవితం కోసమా ఇరవై ఆరేళ్ళు ముఖ్యంగా గత నాలుగేళ్ళు కలలు కన్నది! పెళ్ళయి ఆరునెలలు దాటినా అరమరలేని దాంపత్య జీవిత మధురిమ....తామిద్దరూ చవిచూడలేదంటే ఇదెంతటి దురదృష్టం? ఈ దేశంలో ఇలాటి దురదృష్టవంతులే ఎక్కువేమో!

సినిమా అంటే చెల్లాయీ, తమ్ముడూ హాజరు! వాళ్ళిద్దర్నీ వేరుగా వెళ్ళండని అమ్మ నాన్న చెప్పరు! తామిద్దరూ చెప్పలేరు? ఖర్చు పదిరూపాయలు....లలిత పక్కన కూర్చున్న చెల్లాయి (దాని ఊహలకూ రెక్కలొస్తున్నాయి మరి.) లలిత చెవిలో .. తన మాట చెవి దూరకుండా రొద చేస్తుంటుంది! తన పక్కన కూర్చున్న తమ్ముడు....తన చెయ్యి ఏ క్షణంలో లలిత చేతిని స్పృశిస్తుందో "ఎక్స్-రే" కళ్ళతో కనిపెడుతుంటాడు! సినిమానుంచి వచ్చి చికాకు! ఆ నెలలో



అదనంగా అప్పు ఇరవై రూపాయలు తేలటం తప్ప మరో ఆదాయం ఆనందం వుండదు!

అమ్మ, నాన్న, చెల్లాయి, తమ్ముడికి కలిపి తన జీతంలో మంచి "ఇంత" అని ఇచ్చేస్తే ...వాళ్ళంతా వేరుగా వుంటే... తనూ లలితా ఓ చిన్నగదిలో.... వాళ్ళందరికీ కాస్తంత దూరంగా వేరుగా వుంటే ఎంత హాయిగా వుంటుంది! ఈ ఆలోచన రోజుకు కొన్ని వందలమార్లు చేయటమే తప్ప....ఆచరించ లేని కనీసం అమ్మ నాన్నలతో చెప్పలేని బలహీనత....ప్రాణం తీస్తోంది. కొడలు పిల్లని తమ దగ్గరే అ పెట్టుకుంటే తప్ప .. కొడుకు తమకు దక్కడని, అందుకు అనుగుణంగా అను బంధాల సంకెళ్ళు వేసే అమ్మా నాన్నల చతురత... జాలి గొలిపే "కష్టాల.... ఆర్థిక కష్టాల....చిన్నప్పట్నుంచీ పెంచి పెద్ద చేయటంలో పడిన కష్టాల పరంపర వాక్చతురత....తన చుటూరా పాలెగూడు అల్లేశాయి! ఊపిరాడటం లేదు.

శరీరమూ, మనసూ, కోరికల బరువుతో ఒరిగి పోతున్నాయి ...ఎలాగూ ఆ నరకంలో తను గడపలేడు. ఏదో వెర్రి కోపం....తిక్క,

తన సరదాలు తను తీర్చుకుంటాడు.

ఇలాటి సరదా కొడుక్కి అబ్బాయని తెలిస్తే అమ్మా, నాన్న బాధపడతారేమో గానీ, భయపడరు! కారణం కోడలు "ఎర" తమ దగ్గరే వుంది. కొడుకు సంపాదన లేకుంటే, పదో, పాతికో (సినిమా ఖర్చు) ఇలా తగలడినా....మిగతాది తమచేతికే రాకపోదని భరోసా.

"సార్! ఈ వేపు రాండి!" మొరటుగా, రహస్యంగా, దగ్గరలో వినిపించిన గొంతుకతో, త్రుళ్ళిపడ్డాడు జగన్మోహన రావు....బుర్ర మీసాలతో, గళ్ళ లుంగీతో, కండ పుష్టితో, సినిమాలలో విలన్ అనుచరుడిలా వున్న వాడొకడు, ఎలక్ట్రిక్ లైటు స్థంభం క్రీనీడలో నిల్చుని ఉన్నాడు. జేబులోని ఇరవై రూపాయలు జేబుల్లోంచి లాక్కోడు కదా? అనుకున్నాడు జగన్మోహనరావు.

"చక్కటి అమ్మాయి....ఇక్కడే .. నాలుగడుగులు వేసారంటే చాలుబాబూ!" అలాగే గుసగుసగా అన్నాడతగాడు. ఈ మాటు అంత మొరటుగా ధ్వనించలేదతగాడి కంఠస్వరం యాంత్రికంగా అడుగులు వేశాడు. కుతూహలంతో బాటు మొదటిసారిగా తప్పు చేస్తున్నానేమోనన్న భయం....గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి;

"లోపలికెళ్ళండి!" అంటూనే "రాజ్యం! ఎవరో బాబుగారొచ్చారు చూడు...." అంటూనే కేకపెట్టాడా గళ్ళ లుంగీవాలా!

చిన్న పెంకుటిల్లు రెండే రెండు గదులు....అవతల బాత్‌రూం. పరిశుభ్రంగానే వున్నాయి...రాజ్యం కూడా అందంగానే వుంది, బహుశా తన వయసు వుంటుందేమో ...

"రాండి!" ఆహ్వానించింది. ఇలాటి ప్రదేశాలను గురించి...తన ఫ్రెండ్స్ కొందరు చెప్పగా విన్నాడు....బిలబిల్లాడుతూ చాలామంది అమ్మాయిలు వుంటారనీ .తను ఎన్నుకోవాలని అదేం లేదిక్కడ...ఇదేదో హై స్టయిల్ సైడ్ బిజినెస్‌లా వుంది!

రెండో గదిలో నవారు మంచం! పరుపు .. టేబిల్ ...మిర్రర్... నీట్‌గా వుంది పొందికగా.

"అలా కుర్చీలో కూర్చోండి "

మట్టి వున్న పరుపు పరుస్తూ అంది రాజ్యం, ఆ కంఠ స్వరంలో ఎలాటి భావమూ లేదు . వ్యాపార ధోరణి తప్ప!

"అతగాడు...." ఏమనాలో తోచక అన్నాడు జగన్మోహనరావు. "బయటికి వెళ్ళాడు. ఓ గంట దాటాక వస్తాడు.ఏం? ఏవన్నా కావాలా సందు చివర ఉంటాడు పిలవనా?" అంది.

"ఊహూఁ వద్దు!" పులినోట్లో తల పెట్టబోతున్న మేకలా... కుర్చీలో బిగుసుకుపోయి కూర్చున్నాడు....

"బహుశా మీకిలాటివి అలవాటు

లేదనుకుంటాను!'' అంది రాజ్యం టేబిల్, మిర్రర్ దగ్గర ఏదో సర్దుతూ....

''మీకెలా తెలుసు?'' నవ్వటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

''మీ మొహమాటమే చెబుతోంది! నన్ను ''మీరు'' అనటంలోనూ తెలుస్తోంది!'' తమాషాగా నవ్వుతూ అంది రాజ్యం—'' ఇక ఇది అలవాటుగా మారనూ వచ్చు .... సరే! ఎలాగూ వచ్చారు...కాలం గడవాలిగా... కాస్తంత కబుర్లు చెప్పుకుందామా?'' అంది తిరిగి చనువుగా....

తలూపాడు. నిజానికి గంట ఎలా గడపాలన్నది. ఈ గదిలో అడుగెట్టిన మరు క్షణంలో ఎదురైన సమస్య! బహుశా ఇలాటి వాళ్ళకు ఎదుటిమనిషి 'పల్స్' బాగా తెలుసునేమో!

''మీరు మగాళ్ళు ఇలాటి సరదాలు అలవరుచుకున్నా....సరదాగా వచ్చినా.... పోయేదేం లేదు.. కానీ నాకు ఆడ వాళ్ళకు ...అలా కాదే! ఒకసారి ఈ ఊబి లోకి దిగామంటే. ఇక బయట పడేదిలేదు ... నాలానే!'' మంచం చివరగా వదిగి కూర్చుని మృదువుగా అంది రాజ్యం ... ఆమె ప్రవర్తన మాటలు 'లేకి'గాలేవు.

''మరి ఇన్ని తెలిసి మీరెందుకు దిగారీ ఊబిలోకి!'' కాస్త బెరుకు తగ్గి అడిగాడు.

'ఏం చేస్తాం? ఖర్మ! అనే కంటే నన్ను పెళ్ళాడిన మహానుభావుడి తెలివి!'

''మీకు పెళ్ళయిందా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అహా! అగ్నిసాక్షిగా.... అందరాడ పిల్లలకులానే చక్కగా జరిగింది.కట్నంతో సహా కాపురానికి వచ్చాను. మొదట్లో అర్థం కాలేదు గానీ. ఆ ఇల్లోనరకమని తేలి పోయింది... అత్త. మామ. ఆడ బడుచులూ,వచ్చే పోయే బంధువులూ సత్రంలా వుండేదా ఇల్లు .. ! ఏ క్షణమూ నాకూ. మా ఆయనకూ కాస్తంత ఏకాంతంగానీ. హాయిగానీ ఉండేవి కావు! ఇల్లు మనుషు




లతో కిటకిట లాడుతుండటం వల్ల.... ఆయన వీధిలో .... నేను ఇంట్లో.... ఎప్పుడో, ఏమిటో....కక్కుర్తితో ఒకరి కొకరం చేరువ అయ్యే వాళ్ళం....ఆ సమయంలో ఆనందం కంటే 'అసహ్యం ఎక్కువగా కలిగేది. మూడేళ్ళు అలా సాగింది! ఈ లోగా ఓ బిడ్డ పుట్టి పోయింది నాకు.

ఆయనగారు విసిగిపోయి ... మీలానే ఏదో దారి చూసుకున్నారు. ఒంటరిగా మిగిలిపోయిన నా పరిస్థితి మరింత ఘోరంగా తయారయింది. చాకిరీ చేయడం... అందరూ తినగా మిగిలిన తిండి చాలసీ చాలకపోసీ.... తినటం నా భర్త చెప్పగా అరగటానికి కారణం నాలో ఆకర్షణ లేకపోవడమేనన్న తిట్లు తినడం.... బ్రతుకు దుర్భరమైపోయింది'

ఓ శుభముహూర్తాన తరచూ ఇంటికి వస్తూ, నాకు సానుభూతి చూపిస్తూ ... చేరువైన ... మావారివేపు బంధువొక డితో లేచిపోయాను. తీరా అతగాడితో లేచివచ్చాక నే నతగాడిమీదే ఆధారపడ్డాక నామీద సానుభూతి ఎగిరిపోయిందివాడికి. నా మానాన నన్ను వదలిపోయి ... చక్కగా పెళ్ళిచేసుకున్నాడు(ట)! మా వారికీ దారి వుంది! నన్ను లేవదీసుకు వచ్చినవాడికీ దారి దొరికింది! కానీ నాకు దారేదీ? అలా అలా గాలివాటుకు ఇలా కొట్టుకువచ్చాను ఇక ఇది అలవాటుగా జీవనంగా మారిపోయింది!'' రాజ్యం చెప్పడం ఆపింది. ఆమె ముఖంలో, ఆ అనుభవాల తాలూకు జుగుప్స ప్రతిబింబిస్తోంది. ఏదో అలసటతో కళ్ళు మూసుకుంది. అందంగా వుందనిపించిన ఆమె మొహం కఠిన పాషాణంలా వుంది క్షణంలో!

జగన్మోహనరావు త్రుళ్ళిపడ్డాడు. రాజ్యం కథ.... తన కథకు దగ్గరగా వుంది. లలితకూడా ఒకనాడు ఇలాగే ... ఆ ఆలోచన అతగాడి శరీరాన్ని మంచు ముక్కలా మార్చింది.

''వెధవ సోదేదో చెబుతూ కూర్చున్నాను రండి. అలా మంచంమీద కాస్తంత విశ్రాంతిగా .'' రాజ్యం దగ్గిరగా వచ్చింది. ఆమె తిరిగి మామూలుగ వుంది. అనుభూతుల కఠినమైన బ్రతుకు తెరువామెది మరి!

''వద్దు వద్దు ... ఇంకో అరగంట వుందికదూ టైం? మీరు మరోలా అనుకోకండి మీ కివ్వవలసిందెంతో చెబితే గంటకూ ఇచ్చేస్తాను!'' అన్నాడు. అతగాడి కంఠస్వరం కొద్దిగా కంపిస్తోంది.

''అదేం? ఉట్టినే డబ్బెందుకిస్తారు? ఇంతదూరం వచ్చి ..? రాజ్యం మాటలు మధ్యలో వుండగానే అన్నాడతగాడు.

''యాంత్రికంగా. కుతూహలంకొద్దీ వచ్చానంతే . మీ డబ్బు ...'' జేబులో నుంచి వందరూపాయలనోటు బయటికి తీశాడు. రెండోసారికూడా తియ్యబోతుం




తగా రాజ్యం వారించింది: "చాల్లెండి మరి ఇవ్వొద్దు. మీకు వెళ్ళాలనుంటే వెళ్లొచ్చు ..." అంది జాలి నిండిన కళ్లతో.

గబగబ బయటికి వచ్చాడు. అడు గులు రోడ్డమ్మట పరుగులు తీస్తున్నాయి స్నేహితుడింటి దగ్గిరకి వచ్చేసరికి. మనసు ఓ దృఢ నిశ్చయానికి వచ్చేసింది. తలుపు తట్టాడు.

"రాఘవా: మొన్ననోనోరోజు మీ పక్క గదేదో ఖాళీగా వుందని. అద్దె పాతిక అనీ చెప్పావుగదూ: ఇదుగో అడ్వాన్సు. ఓనరుతో మాట్లాడి రూమ్ రెడీగా వుంచు ... ఓగంటలో సామానూ లలితతో వస్తాము ఓ నెలకు ఈరూంలో సర్దుకుంటాం. ఈ లోగా చిన్న యిల్లెక్కడన్నావుంటే చూస్తాములే.''అన్నాడు.

చేతిలో పది రూపాయలు పెట్టి వచ్చినంత వేగంగానూ వెళుతున్న అతగాడికి, వెనకనుంచి 'ఇంట్లో ఏదేనా గొడవజరిగిందేమిటిరా మోహన్?" అంటున్న స్నేహితుడి ప్రశ్న వినిపించలేదు.

అదే సమయంలో రాజ్యం తనచేతిలో వున్న పది రూపాయలనోటుకేసి నిర్లిప్తంగా చూస్తోంది! ఆ గళ్ళ లుంగీవాడు వచ్చి డేగలా ఆ నోటు లాక్కుంటూ "అదేం? వాడప్పుడే నిప్పుతొక్కిన కోతి లాగా పరుగు తీశాడేమిటి? గంట కాలేదే?" అంటూంటే ఉలికిపడిందామె.

"పోనిద్దూ! పిరికి గొడ్డు!" అనేసింది. గళ్ళలుంగీవాడు నవ్వుకుంటూ బయటికి వెళ్ళాడు.

రాజ్యం మనసులో మాత్రం ఏదో వేదన రేగింది "పాపం! మంచివాడులా వున్నాడతగాడెవరో! ఏదో ఆవేశంలో. ఏదో ఆశించి వచ్చాడు. కాస్తంత ఆనందం కలిగించివుంటే ఏం పోయేది నాకు! నాకీ వృత్తేం కొత్తా?

కానీ....ఈ ఊబి...ఒకసారి అలవాటు పడితే....మరి వదలదు. ఎక్కడో ఓ చోట కాలుజారుతాడు కాబోలు ఏమో వాతెందుకు? నేను మాత్రం అతగాణ్ణి పతనానికి లాగలేదు....ఏదో కథ అల్లి... చెప్పేశాను! నిజానికి ఈ మొరటు. బుర్ర మీసాల. గళ్ళలుంగి వెధవే నా అసలు మొగుడనీ....వాడే వాడి తాగుడుకోసం. విలాసాల కోసం ...నన్ను నరకంలోకి తోశాడనీ....వాడు చెప్పినట్టు వినకపోతే వాత కొడతాడనీ....ఈ దేశంలో పతివ్రతలు ఇన్ని రకాలుగా వుంటారనీ.... నిజం అతగాడికి తెలిస్తే ...ఇక్కడే ప్రాణాలు వదిలేవాడేమో ...పాపం!ఏమైనా నాకు తగని అలసటగా చిరాగ్గా వుందీరోజు వీడికి డబ్బొచ్చింది .. ఇకనా జోలిరాడు! హాయిగా నిద్రపోతాను!" అనుకుంటూ లైటు తీసేసి .. మరు నిముషంలో నిశ్చింతగా నిద్రపోయింది రాజ్యం.

అమ్మా, నాన్న, చెల్లాయి, తమ్ముడు, ఎవరో చచ్చినట్లు గోలపెడుతుండగా, ఇరుగు పొరుగు వారు తల కోరకంగా వ్యాఖ్యానిస్తూ, చూస్తుండగా....యుగ యుగాలుగా మనిషి అన్వేషిస్తున్న ఆనందపు అంచులు చేరటానికోసం....అదేమటన్నది విడమరచి చెప్పటం ఇష్టంలేక బిత్తరపోయి వున్న లలిత చెయ్యి ధైర్యంగా పట్టుకుని, రెండు సూటుకేసులతో రిక్షాలో బయల్దేరి....ఆ అర్ధరాత్రి వేళ ఆ చిన్నగదిలో "గృహ ప్రవేశం" చేశాడు జగన్నాధరావు.

"అక్కా! రాజ్యం! నీ మేలు జన్మజన్మలకూ మర్చిపోలేను!" అందతగాడి హృదయం అర్ద్రంగా! ✱